

# చలి చీమ

-వై.రుక్మిణీదేవి





తండ్రి శవం దగ్గర విషాదం గూడు కట్టుకున్నట్లు కూర్చున్న ప్రహ్లాదను సైగ చేసి పిలిచాడు పరమేశ్వర మూర్తి.

ప్రహ్లాద నెమ్మదిగా లేచి లోపలికెళ్ళాడు. పరమేశ్వర మూర్తి ముఖంలో చీకాకును గమనించి 'ఏమయింది?' అని అడిగాడు

'ఏముంది? ఆ దొంగ నాయాళ్లు మన ప్రపోజల్స్ వేటినీ లెక్క చేయడం లేదు' విసుగ్గా అన్నాడు.

'మనమిచ్చిన ఆఫర్స్ అన్నీ చెప్పారా?'

'చెప్పకపోవటమేమిటి? చిలక్కి చెప్పినట్లు చెప్పాను. ఆ అర్జున వెధవ దారికొస్తేనా?'

'ఎంత పొగరు వాడికి?' ప్రహ్లాద అనుకున్న ఈ మాటనే అర్జునుడితో మాట్లాడుతూ ముప్పైసార్లు మనసులో అనుకున్నాడు పరమేశ్వర మూర్తి.

'అదే నాకూ అన్పించింది. ఆ మిలిటరీ నౌకరీ వాడి కింత తల బిరుసు తెచ్చిపెట్టిందంటే...'

'వాడు మొదట్నుంచీ అంతే. తిక్క రాస్కెల్! తను పట్టిన కుందేలుకి మూడే కాళ్లంటాడు'

'నీ బొంద? నువ్వు మాత్రం తక్కువా?' తలుపు గుండా బయటకు చూస్తూ మనసులో అనుకున్నాడు పరమేశ్వర మూర్తి.

'ఇరవై వేల ఆఫర్ ఇచ్చారా?' కనుబొమ లెగరేసి అన్నాడు ప్రహ్లాద.

'ఆ... ఆ ఇరవైకి ఇంకో ఇరవై కలిపి ఆఫర్ చేశాను. మనం లక్ష ఇచ్చినా పని జరిగేటట్లు లేదు' పెదవి విరిచాడు పరమేశ్వర మూర్తి.

'మరో సందర్భమయితే మనకీ ఇబ్బందే ఉండేది కాదు. ఇదేమో ఎటూగాని వ్యవహారమయ్యె' పరమేశ్వర మూర్తి దీర్ఘంగా నిట్టూర్చాడు.

'వాళ్ళ బిచ్చపు ఏర్పాట్లన్నీ మొదలెట్టేశారా?' మొహం చిట్లిస్తూ అడిగాడు ప్రహ్లాద.

'ఆ... సరుకులన్నీ ఒచ్చేశాయి. డప్పులోళ్లొచ్చి కూచున్నారు. చింతలపూడి నుంచి కూతురు రావాలంట. అది రాగానే ఎత్తేస్తారు. అబ్బ? అక్కడికెళ్ళి పది నిమిషాలు నిల్చుంటే పిచ్చెత్తిపోయేట్లుంది. మృగాలల్లే అరుస్తూ ఏడుస్తున్నారు లేబర్ మూక ఛీ' అన్నాడు పరమేశ్వర మూర్తి.

'ఆ పిల్ల రాకముందే మనమేదైనా చెయ్యాలి' నిశ్చయించుకున్నట్లు అన్నాడు ప్రహ్లాద.

'ఏం మిణుకుతావ్?' అన్నట్లు ప్రహ్లాద కళ్లల్లోకి చూశాడు పరమేశ్వర మూర్తి.

అరవయ్యోపడిలో వున్న పరమేశ్వర మూర్తి, ముప్పైయవ పడిలో వున్న ప్రహ్లాద ఈ గడ్డు సమస్య నెలా పరిష్కరించాలో అర్థంకాక కణతలు రాసుకుంటూ వుండిపోయారు కొంతసేపు.

'అసలు మనం పోలీసుల్ని నచ్చజెప్పి పంపెయ్యడం పొరపాటయ్యింది. ఎలాగోలా వాళ్లని ఇరికించేస్తే మూడు, నాలుగు రోజుల్దాకా కిక్కురుమనకుండా ఉండిపోయేవాళ్లు!' కసిగా అన్నాడు ప్రహ్లాద.

'అప్పుడు మనం కూడా వాళ్లతోపాటు ఆగాల్సి వచ్చేదిగా' అన్నాడు కాస్త దగ్గి గొంతు సవరించుకుని.

'నాన్నగారి విషయంలో ఏ చర్యయినా తీసుకునే దమ్ము ఆ ఇన్స్పెక్టర్ కెక్కడుందీ?' అంతస్తుముందు అడ్డగాడిదై నిల్చుండిపోయే సబ్ఇన్స్పెక్టర్ సోమసుందరానుద్దేశించి అన్నాడు ప్రహ్లాద.

'ముందు నీ దమ్ము ఏ దుమ్ములో కలుస్తోందో చూస్కోరా కుర్ర నాగన్నా?' అనుకుంటూ 'నాన్నగారూ, నారాయణా ఇద్దరూ ఒకే కారులో, ఒకే చోట ఒకే యాక్సిడెంట్లో పోయారు. ఆ సంగతి మనం గుర్తుంచుకోవాలి' అన్నాడు పరమేశ్వరమూర్తి.

నొసలు ప్రక్కన చిటికెన వేలేసుకుంటూ మౌనంగా ఉండిపోయాడు ప్రహ్లాద.

'ఆ ఆర్మీ వెధవ కింత తలతిక్కా?'

'తలతిక్క నీకేమన్నా తక్కువగా ఉందిరా బిడ్డా?' తల గోక్కుంటూ అనుకున్నాడు పరమేశ్వర మూర్తి.

'ఆ అర్జునుడు అన్న మాటలన్నీ వీడు విని ఉంటే... వెధవది? తన విలువ తగ్గుతుందేమోనన్న సంకోచం లేకపోతే, ఈ కుర్ర సన్నాసి నోరు క్షణంలో మూయిద్దును' తనకు తనే రహస్యంగా చెప్పుకున్నాడు.

'గూండాల్ని పిలిపించి శవం లేవకుండా అటకాయించమని పురమాయిస్తే...?' ఉపాయం తోచినట్లు కాస్త హుషారుగా అన్నాడు ప్రహ్లాద.

'నీది బుర్రా? లక్కపిడతా?' అన్నట్లుగా చూశాడు పరమేశ్వర మూర్తి ప్రహ్లాద కళ్లల్లోకి.

'దానివల్ల ప్రయోజనమేమీ ఉండదు బాబూ? ఇప్పుడు మాజీ అయిన పోలీసు కేసు తిరగదోడబడటం తప్ప' అన్నాడు ఆవేశాన్ని కంట్రోల్ చేసుకుని.

డీలాపడిపోయిన ప్రహ్లాద దీర్ఘంగా నిట్టూర్చాడు.

నాకో పద్ధతి తోస్తోంది. మనం నాన్నగార్ని కోవూరికి తరలించేస్తే?'

'ఛాఛా! ఈ సన్నాసులకి భయపడి మహారాజులా బతుకు సాగించిన ఆయన్ని ఆ వెధవ పల్లెటూరుకి తరలించి అక్కడ ఏ వైభవమూ లేకుండా సాగనంపమంటారా?' పరమేశ్వరమూర్తిని కొట్టొచ్చినట్టు అన్నాడు ప్రహ్లాద.

'మరంతకంటే మార్గం కనిపించటంలా' నీళ్ల నమిలాడ ం పరమేశ్వరమూర్తి.

★ ★ ★

పై సంఘటన బ్యాక్‌గ్రౌండ్ ఏమిటంటే...

యాక్సిడెంట్‌లో చనిపోయిన వీరప్రసాద్ చౌదరి నగరంలో ప్రసిద్ధి చెందిన బిజినెస్ మాగ్నెట్.

ఆ వీరప్రసాద్ చౌదరిగారి ముఖ్యమైన, అతి విశ్వాసపాత్రుడైన అనుచరుడు నారాయణ. ఇద్దరూ బాల్య స్నేహితులు. ఒకే ఊరి వాళ్లు. ఇరవై ఏళ్ల క్రితం కాంట్రాక్టు వ్యాపారం చేసే ఉద్దేశంతో పట్నం వస్తున్న వీరప్రసాద్ చౌదరి తనకు సహాయకుడిగా నోట్లో కాస్త అక్షరమ్ముక్కా, విశ్వాసంగా పనిచేసే సుగుణం ఉన్న నారాయణని తన వెంట తీసుకొచ్చాడు.

తన అమోఘమైన తెలివితేటల్తో, నారాయణ నిస్వార్థ సహకారం తోడు కాగా అతి త్వరలో లక్షాధికారి అయ్యాడు వీరప్రసాద్ చౌదరి.

ఆయన మూడం తస్థుల సొంత భవనంలో ఉంటూ మరో నాలుగు మహళ్ళలాంటి ఇళ్లు కట్టించగా నారాయణ తన మూడు వందల గజాల స్థలంలో ఇటుక గోడలతో నాలుగు గదుల ఇల్లు కట్టుకుని దాని మీద పకడ్బందీగా రెల్లుగడ్డి కప్పు అమర్చుకున్నాడు. వీరప్రసాద్ చౌదరి గారి కొడుకులిద్దరిలో ఒకరు అమెరికాలో స్థిరపడగా, రెండోవాడు తండ్రి వ్యాపారాన్ని అన్ని కోణాల్లోంచీ తన ఎంబిఏ నేర్పుతో వృద్ధి చేస్తూ ఆయన కుడిభుజంగా ఉంటున్నాడు. ఒక కూతురు కోటీశ్వరుల కుటుంబపు కోడలిగా వెళ్తే, రెండో కూతురు మద్రాసులో ఇంజనీరింగ్ చదువుతోంది.

నారాయణ మాత్రం ఇప్పటికీ ఆయన విశ్వసనీయమైన అనుచరుడిగానే ఉండిపోయాడు. అతని పెద్ద కొడుకు ఇంటర్ చదివి మిలిటరీలో చేరి తన ధైర్యం, సేవా తత్పరతే క్వాలిఫికేషన్లుగా సీనియర్ సోల్జర్ స్థాయికి చేరుకోగా రెండోవాడు బి.కాం. మూడో సంవత్సరం చదువుతున్నాడు. కూతుర్ని తన తాహతుకు తగ్గట్లు ఒక ఆర్టీసీ ఉద్యోగికిచ్చి పెళ్ళి చేశాడు నారాయణ.

ఆ ముందు రోజు రాత్రి ముఖ్యమైన పని మీద పాలకోడేరు వెళ్ళి తిరిగి వస్తూన్న వీరప్రసాద్ చౌదరి గారి కారుకు లారీ గుద్దుకుంది. డ్రైవర్‌తోపాటు నారాయణా, ఆయనా అక్కడికక్కడే ప్రాణాలొదిలేశారు.

ఈ విషయం దారిన పోతున్న వాళ్ళు గమనించి పోలీసులకు తెలియబరిస్తే వాళ్లు ప్రహ్లాదకు చెప్తే ప్రహ్లాద నలుగురు పెద్దల్ని తీసుకుని హుటాహుటిన యాక్సిడెంట్ జరిగిన చోటికి వెళ్లి డ్రైవర్నీ, నారాయణనీ కారులోంచి తీసి బయట పెట్టించేసి, తండ్రి శవాన్ని కార్లో జాగ్రత్తగా ఇంటికి చేర్చి అప్పుడు అర్జునుడికి కబురు పెట్టాడు. నారాయణ శవం ఫలానా చోట పోలీసు కాపలాతో వున్నదనీ, వెళ్ళి తెచ్చుకోమనీ.

అర్జునుడు, నిద్రపోతున్న సహదేవుణ్ణి లేపి ఇంట్లో చెప్పకుండా ఆటో మాట్లాడుకుని వెళ్లారు. రోడ్డుపక్కన నిర్జీవమై పడివున్న తండ్రిని చూసి సహదేవుడు బోరుమనగా, నిశ్చేష్టుడై నిలబడిపోయాడు అర్జునుడు.

తండ్రి ఏళ్ళ తరబడి చౌదరి గారి నంటిపెట్టుకుని వుండి చేసిన నిస్వార్థ సేవకు ఫలితం ఇదా?' అతని గుండె మండుతున్న కొలిమి కాగా తనను తానే సంభాళించుకుని శవాన్ని ఆటోలో ఇంటికి చేర్చాడు.

విషయం అప్పుడే తెలుసుకున్న నారాయణ భార్య, అప్పచెల్లెళ్ళూ అంతా ఏడుపులు మొదలెట్టారు. ఆ పూరిల్లు పక్కనే ఉన్న చౌదరి గారింట్లో అంతా 'నారాయణని కూడా తెచ్చేసినట్టున్నారు' అనుకున్నారు.

అప్పటికి తెలతెలవారుతోంది.

అప్పటికే ఒక వేదిక ఏర్పాటు చేయిచి వీరప్రసాద్ చౌదరి గార్ని దాని మీద పడుకోబెట్టి పూల మాలలతో కప్పేశారు. మాంచి సుగంధం వెదజల్లే అగరొత్తులతో నాలుగువేపులా నాలుగు వెండి స్టాండులు అమర్చి వెలిగించారు. ఆయన తల దగ్గర తళతళ మెరుస్తూన్న వెండి ప్రమిదలో నూనె వత్తి వేసి వెలిగించి ఉంచారు. కబురు విని వచ్చిన అందరూ తలో పూల మాల ఆయన భౌతిక కాయమ్మీద ఉంచి వందనం చేసుకుంటున్నారు.

అక్కడ నారాయణను చాప మీద పడుకోబెట్టి, తెల్లటి దుప్పటి కప్పి తల దగ్గర కోడలి చేత ప్రమిద దీపం వెలిగింపజేసి బియ్యం కుప్ప మీద పెట్టించారు. అతని భార్యా, అప్పచెల్లెళ్ళూ హృదయ విదారకంగా విలపిస్తున్నారు. నారాయణ స్నేహితులూ, సన్నిహితులూ అంతా వచ్చి ఆ కుటుంబాన్ని ఓదార్చసాగారు.

సరీగ్గా ఏడుంపావుకి ప్రహ్లాద పురమాయింపుతో 'అదెంత పనీ...? నేన్జేచేస్తానుండు' అని చెప్పి నారాయణ వాకిట్లోకి వచ్చాడు పరమేశ్వర మూర్తి.

అప్పటిక్కూడా నారాయణ భార్య శవమ్మీద పడి గుండెలు బాదుకుంటూ ఏడుస్తూనే ఉంది.

మిగతా ఆడవాళ్లు ఆమె నోదారుస్తూనే తగ్గు స్థాయిలో విలపిస్తున్నారు. కాస్త దూరంలో వున్న వాళ్ల పిల్లలు కళ్లనీళ్లతో కుళ్ళికుళ్ళి వెక్కుతున్నారు.

వీరప్రసాద్ చౌదరి గారింట్లో మౌనంగా, మంద్రంగా, నాగరికపు కట్ట వెనుక నవ్య పద్ధతిలో నెమ్మదిగా వ్యక్తమవుతూన్న దుఃఖం నారాయణ ఇంట్లో నాగరికత కట్టని తెంచుకుని వెల్లువై ప్రవహిస్తోందా?' అన్పించింది పరమేశ్వర మూర్తికి.

'బతికున్నన్నాళ్ళూ సాదరయ్య గారి నీడలాగా బతికాడు. ఇప్పుడు సావు కూడా ఆయన్తోటే...' నారాయణ బావమరిది నర్సింహులు ఎవరితోనో అంటూ గొంతు పూడుకుపోగా పై గుడ్డ నోటి కడ్డం పెట్టుకున్నాడు.

'ప్చ్... తనకున్న దాంటో ఇతర్లకి సాయం జేయాలన్న తపనుండేది మడిసిలో' పక్కనతను ఉసూరుమంటూ నిట్టూర్చాడు.

వీరప్రసాద్ చౌదరి గారి గురించి షామియానాలో తను విన్న మాటలు సినిమా డైలాగుల్లా ధ్వనించగా ఇక్కడి మాటలు గుండె లోతుల్లోంచి వచ్చినట్లనిపించగా 'నారాయణ పుణ్యం చేసుకున్నోడే' అనుకున్నాడతను మనసులో.

హాల్లో బల్ల మీద విచారం గూడు కట్టుకున్నట్టు కూర్చున్న అర్జునుణ్ణి సైగ చేసి పిలిచాడు. బల్ల మీది నుంచి లేచి వాకిట్లో కొచ్చాడు అర్జునుడు.

'అనుకోకుండా ఇద్దరి కుటుంబాల మీదా పెద్ద విపత్తే విరుచుకు పడిందయ్యా అర్జునా? విధి లీలలు తెలుసుకోవడం ఎవరి తరం?' విచారంగా అన్నాడు పరమేశ్వర మూర్తి.

కన్నీటిని తుడుచుకుంటూ మౌనంగా ఉండిపోయాడు అర్జునుడు.



**'జీవం వున్నన్నాళ్ళూ చౌదరి గారి సేవకుడి రేంజ్ లోనే బతికాడు మా నాన్న. ఆయన ప్రాణాలు పోగా రోడ్డు మీదికి విసిరేసి ఎవరి దారి వాళ్లు చూసుకున్నారు. మా నాన్న అనాథ శవంగా అయిదారు గంటలు రోడ్డు పక్కన పడి వుంటే... నేను - నేవెళ్ళి తెచ్చుకున్నా సార్!**

'బంధువులంతా వచ్చినట్లేనా?'

'చింతలపూడి నుంచి చెల్లీ వాళ్లు రావాల్సి ఉంది' అన్నాడు అర్జునుడు.

ఇంతలో అంత్యక్రియలకు కావలసిన సరుకులన్నీ రిక్షాలో వేసుకొచ్చి దిగాడొకతను.

'అప్పుడే తీసుకెళ్దామనుకుంటున్నారా?' లౌక్యంగా అడిగాడు పరమేశ్వర మూర్తి.

'చెల్లి వచ్చాక' క్లుప్తంగా అన్నాడు అర్జునుడు.

'ఇప్పుడే లేపటం అంత బావుండదేమో అర్జునా' నాలుకతో పెదాలను రాసుకున్నాడు పరమేశ్వరమూర్తి.

చివ్వున తలెత్తి పరమేశ్వర మూర్తి కళ్లల్లోకి చూశాడు అర్జునుడు.

ఆ చూపులోని తీవ్రతకు తనలో కలిగిన ఉలికిపాటు కప్పిపుచ్చుకోవటానికి విశ్వప్రయత్నం చేశాడు పరమేశ్వరమూర్తి.

ఒక నిమిషం తర్వాత తేరుకుని 'పెద్దయ్యగారి నీడలా ఉండేవాడు నాన్న. ఆయన శవం అక్కడుండిపోగా నాన్న నెత్తేయటం...' గునిశాడు.

'బాగుండదంటారా?' పరమేశ్వర మూర్తి మాటల్ని మధ్యలోనే అందుకుని అన్నాడు అర్జునుడు.

'అది కాదు. పద్ధతిగా ఉండదేమో' అంటున్నాడు ప్రహ్లాద.

'ప్రహ్లాద అంటున్నారా?' అర్జునుడు తన కాలరు పుచ్చుకుని అడిగినట్లు భ్రమ కలిగి అసంకల్పితంగా ఒకడుగు వెనక్కు వేశాడు పరమేశ్వరమూర్తి.

'అదేమిటి? మా నాన్నను తరలించటానికీ, పెద్దయ్యగార్ని తరలించటానికీ లింకు ఏంటి సార్?' విసురుగా అడిగాడు.

'లింకని కాదు. ఏదో పరువూ, ప్రతిష్ఠా అని పాకుతున్నాడు గదా ఆ ఉడుకు రక్తం ప్రహ్లాద?' చాలా తాపీగా అన్నాడు.

'పరువా?' అర్జునుడి కళ్ళు మరింత ఎర్రబడి విప్పారాయి.

పరమేశ్వర మూర్తి గుండె సన్నగా దడదడలాడింది. 'ఈ ఆర్మీ వెధవతో వ్యవహారం అంత సులువు కాదేమో' అన్న డౌటు స్ఫురించగా.

'పెద్దయ్యగారి శవాన్ని రేపటి దాకా ఉంచాలని ఇంజెక్షన్లు, అవీ చేయిస్తున్నారు. అలా నారాయణ క్కూడా...'

'ఇంజెక్షన్లు చేయించి రోజుల తరబడీ నిర్జీవులైన వాళ్లను ఇంట్లో పెట్టుకునేంత గొప్ప వాళ్ళమా మేము?' పరమేశ్వర మూర్తి కళ్లల్లోకి సూటిగా చూశాడు అర్జునుడు.

'అబ్బెబ్బే! ఆ ఖర్చంతా ప్రహ్లాదే పెట్టుకుంటాడయ్యా?'

'జీవం వున్నన్నాళ్ళూ చౌదరి గారి సేవకుడి రేంజ్‌లోనే బతికాడు మా నాన్న. ఆయన ప్రాణాలు పోగా రోడ్డు మీదికి విసిరేసి ఎవరి దారి వాళ్లు చూసుకున్నారు. మా నాన్న అనాథ శవంగా అయిదారు గంటలు రోడ్డు పక్కన పడి వుంటే... నేను - నేవెళ్ళి తెచ్చుకున్నా సార్! ఇక ఆయన్ని ఎవరి దాక్షిణ్యానికీ వదలదలచుకోలేదు నేను' గుప్పిళ్లు బిగించి ఆవేశంగా అంటూన్న అర్జునుణ్ణి చూసి పరమేశ్వర మూర్తి బి.పి. నాలుగు పాయింట్లు పెరిగింది.

'అంటే ఆ ఖంగారులో ఏం తోచదు గదా మరి' ఏమనాలో తోచక ఖంగారుగా అన్నాడు.

'సార్! మీరేమీ అనుకోనంటే ఒక్క మాట' అన్నాడు అర్జునుడు.

'చెప్పు' అన్నాడు పరమేశ్వర మూర్తి గుండె దడను కంట్రోల్ చేసుకుంటూ.

'మీ నాన్నగారున్నారా సార్?'

'వెర్రి నవ్వొకటి నవ్వాడు పరమేశ్వర మూర్తి. 'మా నాన్నగారు నువ్వు మిలిట్రీలో చేరకముందే పోయారు గదయ్యా. ఆయన పోయినపుడు ప్రహ్లాదా, నువ్వూ కూడా వచ్చారు. గుర్తుందా?' సంభాషణను లైట్‌సైడ్ పట్టించటానికి మాటల్ని వెదుక్కుంటూ అన్నాడు.

'ఆయనగారి విషయంలో ఇలాంటి పరిస్థితే ఎదురైతే మీరేం చేసేవారు?' ఛెళ్లున చెంప మీద చరిచినట్లనిపించి కుడిచేత్తో ఎడమచెంప రాసుకున్నాడు పరమేశ్వర మూర్తి.

కాసేపు మౌనంగా ఊరుకుని గొంతు సవరించుకుని 'ఇలాంటి సందర్భాలు అన్నప్పుడల్లా ఎదురౌతాయా అర్జునా?' అన్నాడు తాపీగా.

'పోనీ ఇంకో మార్గం ఉంది. నాన్నను రేపటి మధ్యాహ్నం వరకూ మార్చురీలో ఉంచితే... వాళ్లు పువ్వుల్లో పెట్టి అప్పగిస్తారు మనకి. ఇంకేదో అనబోయి మాటలు పెగిలిరాక దిక్కులు చూశాడు పరమేశ్వరమూర్తి.

అంత ఆవేశం, ఉక్రోషంలోనూ అర్జునుడి పెదాల మీద వ్యంగ్యమైన నవ్వొకటి నిలిచింది.

'మరీ అమాయకుల్లా వున్నారు సార్ మీరు. మార్చురీ పూలతోటలా ఉంటుందా?' అన్నాడు.

తన వెర్రి పోజును దాచుకోవటానికి తల దించుకున్నాడు పరమేశ్వర మూర్తి.

'.... ఇంకా చూసుకోవలసిన పనులు చాలా ఉన్నాయి' సాధ్యమయినంత మర్యాదగా అన్నాడు అర్జునుడు. 'ఇక దయ చేయండి' అన్నట్టుగా. మొహం నల్లగా పెట్టుకుని వెనుదిరిగాడాయన.


★ ★ ★

పరమేశ్వర మూర్తీ, ప్రహ్లాద అలా తర్జనభర్జనలు పడుతూంటే విషయాన్ని చూచాయగా విన్న అరవింద స్వామి వాళ్లిద్దరి మధ్యా తలదూర్చారు.

(మిగతా 11వ పేజీలో)

# ఖర్చు చేయడమూ ఓ కళే!

‘డబ్బు... డబ్బు... డబ్బు... ఎప్పుడూ డబ్బు గొడవేనా? డబ్బు తప్ప మరొకటి లేదా?’ అని విసుక్కునే వాళ్ళు కొందరుంటే ఉండవచ్చుగాక, కానీ డబ్బుకు లోకంలో ఉన్న విలువ అంతా ఇంతా అనరానిదనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇల్లు కదలి బయటికి వెళ్ళేనే కాదు, ఇంట్లో ఉన్నాసరే అనుక్షణం డబ్బు అవసరం ఉండనే ఉంటుంది. ఇది నిత్య సత్యం. అయితే ఆ డబ్బు విలువను ఎలా గుర్తించాలో, దాన్ని ఎలా అవసరాల కోసం కాపాడుకోవాలో, ఎలా సంరక్షించుకోవాలో, ఎలా సద్వినియోగం చేయాలో తెలియక చాలామంది ఇబ్బందులు పడుతుంటారు. డబ్బును సమర్థవంతంగా నిర్వహించుకోలేని వారు ఉన్నదంతా ఊడిపోగా బికారులౌతారు. సామర్థ్యాన్ని ప్రదర్శించిన వారు దాని ఫలాల్ని అనుభవిస్తూ సంపన్నులౌతారు. డబ్బుతో వ్యవహారం అంటే నిప్పుతో చెలగాటం లాంటిదే. నిప్పు కూడా మన ఆకలి తీర్చనూ గలదు, నిలువెల్లా కాల్చివేయనూ గలదు. అందువల్ల డబ్బు విలువను తెలుసుకోవడం ఎంతో అవసరం.




పూర్వం ఒక కవి డబ్బును గూర్చి ఇలా అన్నాడు -

‘అర్థానామార్జనే దుఃఖం ఆర్జితానాం చ రక్షణే
ఆయే దుఃఖం వ్యయే దుఃఖం ధిగర్థాః కష్టసంశ్రయాః’

అంటే - డబ్బును సంపాదించాలంటే ఎంతో కష్టం. సంపాదించిన డబ్బును కాపాడుకోవాలంటే ఎంతో కష్టం. ఆదాయం ఎక్కువైతే కష్టం. ఖర్చు ఎక్కువగా చేస్తే కష్టం. అందుకే ఈ డబ్బు ఎన్నో కష్టాలను తెచ్చిపెడుతుంది’ అని అర్థం. ఇలా ఎన్నో కష్టాలున్నాయి గదా అని డబ్బును సంపాదించకుండా ఉండగలమా అంటే అదీ కుదరదు. అందుకే డబ్బును తప్పక సంపాదించాలనీ, సంపాదించిన డబ్బును ఇలా సద్వినియోగం చేయాలనీ భర్తృహరి తన నీతి శతకంలో అంటాడు -

‘దానం భోగో నాశస్తిస్రో గతయో భవన్తి విత్తస్య
యో న దదాతి న భుంక్తే తస్య తృతీయా గతిర్భవతి’

అంటే - డబ్బును వియోగం చేయడానికి మూడే మార్గాలున్నాయి. ఒకటి దానం. రెండవది భోగం. మూడవది నాశం. ఈ మూడింటిలో శ్రేష్ఠమైంది దానం. అంటే ఇతరులకు పంచిపెట్టడం. తన అవసరాలకు తగినంత మేర నిలువ చేసుకొని తన దగ్గర అధికంగా ఉన్న డబ్బును దీనులకూ, ఆర్తులకూ, అల్లాడిపోతున్న వారికీ తప్పకుండా ఇవ్వాలి. అలా చేస్తే తృప్తీ, ఆనందమూ, పుణ్యమూ, రాబోయే జన్మలో సంపన్నత్వమూ సంప్రాప్తిస్తుంది. ఇలా చేయడం ఇష్టం లేకుంటే తానూ, తన కుటుంబమూ హాయి భోగాలు అనుభవించేందుకు ఖర్చు చేసుకోవాలి. ఈ పద్ధతి అంత శ్రేష్ఠం కాకపోయినా, మధ్యమంగా తృప్తికరం. ఈ రెండు విధాలుగా డబ్బును వినియోగం చేయకుంటే మూడవ గతి తప్పదు. అంటే దానభోగాలు లేని డబ్బు కాలప్రవాహంలో నశించిపోతుందే తప్ప ఎవరికీ ఉపయోగపడదు. వ్యర్థంగా కాలగర్భంలోనూ, భూగర్భంలోనూ, విదేశీ బ్యాంకుల్లోనూ కరిగిపోయే బదులు, తోటి మానవుల ఆకలిదప్పులనూ, ప్రాణావసరాలనూ తీర్చడానికి ఉపయోగిస్తే ఎంతో పుణ్యం వస్తుంది కదా.

ఒకరికి ఇవ్వకుండా, తామూ అనుభవించకుండా ఎప్పుడూ డబ్బును దాచిపెడుతూనే ఉండేవారు కూడా ధనవంతులే అయితే, రత్నగర్భ అయిన భూమిలోనూ ఎన్నో సంపదలున్నాయి కనుక ఆ భూమిపైనే నివసిస్తున్న జనులందరూ ధనవంతులే కదా అని చమత్కరించాడు. హితోపదేశకారుడు ఈ విధంగా -

‘దానోప భోగ హీనేన ధనేన ధనినో యది
పృథ్వీ ఖాత నిఖాతేన ధనేన ధనినో వయమ్’

అంటే దానం, భోగం వల్ల మాత్రమే డబ్బు విలువ పెరుగుతుందే కానీ ఎవరికీ పనికిరాకుండా దాచిపెడితే దాని విలువ పెరగదని ఈ సూక్తిలోని పరమార్థంగా మనం గ్రహించాలి.

మేఘాల నీడ, దుష్టుల స్నేహం, కొత్తగా వచ్చిన ధ్యానం, యౌవనం, డబ్బు ఇవన్నీ ఎక్కువకాలం సుఖాన్ని ఇవ్వలేవనీ, కనుక వాటిని యోగ్య కాలాల్లో మాత్రమే ఉపయోగించుకోవాలి తప్ప దుర్వినియోగం చేయరాదనీ పెద్దలు చెబుతారు. లోకంలో సాధారణంగా డబ్బు విషయంలో రెండు విధాలుగా భావించే వారున్నారు. దానాలు చేస్తూ ఉంటే, డబ్బంతా పోయి, దారిద్ర్యం కలుగుతుందేమోనని భయపడేవాళ్లు కొందరు. దానాలు చేయకపోతే, పుణ్యం రాకపోగా, రాబోయే జన్మలో దరిద్రం చుట్టుకుంటుందేమో అని బెంగపడేవాళ్లు మరి కొందరు. వీళ్లలో మొదటి వాళ్లు మూర్ఖులనీ, రెండవ వారు ప్రాజ్ఞులు (వివేకవంతులు) అనీ, ప్రాచీన నీతి చెబుతోంది.

డబ్బు లేకుంటే మానవ జీవనం అసాధ్యం. కనుక డబ్బును సంపాదించవలసిందే కానీ, దురాశ పనికిరాదు. దీనినే తృష్ణ అంటారు. వివరంగా చెప్పాలంటే తృష్ణ - ధన దాహమే. అది ఎంత నెయ్యి పోసినా ఆరని అగ్నిజ్వాల వంటిది. కనుక అది పనికిరాదు. డబ్బు జీవించడానికి గల అనేకావసరాల్లో ఒకటే గాని, డబ్బే జీవితం ఎంత మాత్రం కాదు. ఈ సత్యాన్ని తెలుసుకుంటే డబ్బు విలువ తెలుస్తుంది. ధర్మాచరణ కోసం పెళ్లి చేసుకొని, సంతానంగా పుత్రికను కన్న తరువాత ఆ పుత్రికను తల్లిదండ్రులు ధనలక్ష్మిగా భావించినా, ఆమెకు పెళ్లి చేసి కన్యాదానం చేయవలసిందే కదా. తాను కన్న ధనం కదా అని ఏ అమ్మ అయినా ఆ పుత్రికను ఇంట్లోనే ఎల్లకాలం రక్షించలేదు కదా. అలాంటిదే డబ్బు. అందుకే దానిని యోగ్యులకు దానం చేసి, మానవులు కృతార్థులు కావాలి.

**-డా.అయాచితం నటేశ్వర శర్మ**

---

**(9వ పేజీ తరువాయి)**

అరవిందస్వామి ప్రహ్లాద మేనమామకు తోడల్లుడు. ‘ఇదుగో మీ మాటలన్నీ నే వింటూనే ఉన్నాను. నేనో సలహా ఇవ్వనా?’ ఇద్దరి వేపూ చూస్తూ అన్నాడు.

అరవింద స్వామంటే అంతగా పడని పరమేశ్వర మూర్తి కళ్లు చిట్లిస్తే ‘ఏదో చెప్పండ’న్నట్లుగా కళ్లు విప్పార్చి చూశాడు ప్రహ్లాద. అతని కంటి భాషను అర్థం చేసుకున్న అరవిందస్వామి ‘వాళ్ళనే ఊరు తరలించేస్తే ప్రాబ్లమ్ ఉండదుగా’ అన్నాడు క్లుప్తంగా.

ఒక యాభై వేలు ఇటు రానీయవయ్యా ప్రహ్లాదా... కొన్ని నిమిషాల్లో నీ ప్రాబ్లంని పరిష్కరిస్తా’ చిటికె వేస్తూ అన్నాడు అరవిందస్వామి.

ప్రహ్లాద గబగబా లోపలికెళ్లి రూపాయల కట్టలు అరవిందస్వామి కందించాడు.

అతనా కట్టల్ని లాల్చీ జేబులోకి తోసి ‘నే వెళ్తాస్తా’ అంటూ పెద్దపెద్ద అంగలు వేస్తూ నారాయణ ఇంటి వైపు నడిచాడు.

★ ★ ★

అరగంటలో తిరిగొచ్చాడు అరవిందస్వామి.

‘అంతా సెటిల్ చేసేశానయ్యా. అరగంటలో కోవూరెళ్ళిపోతామన్నాడు అర్జునుడు. ‘చూశావా మన తడాఖా?’ అన్నట్లు పరమేశ్వర మూర్తి కేసి చూస్తూ ప్రహ్లాదకు చెప్పాడు. ‘సరీగ్గా అరగంటలోనే నారాయణ ఇంటి ముందు రెండు లారీలొచ్చి ఆగాయి. కొంత సేపటికే నారాయణ శవం, సరుకులతోపాటు బంధు మిత్రులంతా రెండు లారీల్లో కోవూరికి తరలి వెళ్ళిపోయారు.

★ ★ ★

తెల్లవారుజాము రెండున్నరకు వీరప్రసాద్ చౌదరి పెద్ద కొడుకు విశ్వామిత్ర వచ్చాడు. వీరప్రసాద్ చౌదరి అంతిమ యాత్రకు సన్నాహాలు మొదలయ్యాయి.

పేపరు కుర్రాడు పేపరేసి చౌదరి గారికి అంతిమ నమస్కారం చేసి చక్కాబోయాడు. ఆ హడావిడిలోనే ఒక పేపరు అందుకుని చకచకా తిరగేయసాగాడు పరమేశ్వర మూర్తి. పేపరు నాలుగో పేజీలో అతని దృష్టి నిలిచిపోయింది. కొన్ని క్షణాల తర్వాత తేరుకుని ఆ పేపరు తీసుకెళ్ళి హాల్లో నిల్చుని కాఫీ సిప్ చేస్తున్న ప్రహ్లాద మొహం ముందు పెట్టాడు. ఆ పేపర్లో ఒక మూల ‘నిర్యాణము’ శీర్షిక కింద నారాయణ ఫొటో ముద్రించబడి ఉంది. ఫొటో కింద ప్రముఖ వ్యాపారవేత్త శ్రీ ఎం.వీరప్రసాద్ చౌదరి గారి అనుచరుడు శ్రీ ఎల్.నారాయణ అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన కోవూరులో జరుపబడ్డాయి. ఆయన దివ్య స్మృతికి చిహ్నంగా కోవూరులో కొత్తగా కట్టనున్న అనాథాశ్రమానికి యాభై వేల రూపాయలు విరాళమిచ్చారు ఆయన కుమారులు ఎల్.అర్జునుడు, సహదేవుడు... ప్రహ్లాద చేతిలో కాఫీ కప్పు కింద పడి భళ్లున బద్దలైంది. ★